క్లుప్తంగా

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ



సర్టిఫికెట్లతో విద్యార్థులు

పొందూరు: నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన గ్రిగ్స్ పోటీల్లో పొందూరు మండలంలోని లోలుగు కేజీబీవీ విద్యార్థినులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. వాలీబాల్ పోటీల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. టెన్నికాయిట్‌లో సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానం, జూనియర్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. జూనియర్స్ షాట్‌పుట్, డిస్కస్‌త్రోల్లో డి.హాసిని ప్రథమ స్థానం, వై.జాహ్నవి ద్వితీయ స్థానాలు సాధించారు. సీనియర్ షాట్‌పుట్‌లో కె.జానకి ప్రథమ, ఎస్.ధనుశ్రీ ద్వితీయ స్థానాల్లో నిలిచారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ సౌమ్య, పీటీ రూపవతి అభినందించారు.

320 మందికి నేత్ర పరీక్షలు



కంటి ఆపరేషన్లకు ఎంపికైన రోగులు

బూర్జ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని మామిడివలసలో పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. జై ఆదివాసీ ఎఫ్‌పీఓ సీఈఓ ఎ.గణేశ్వరరావు అధ్యక్షతన శిబిరం ఏర్పాటు చేశారు. 320 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 72 మంది ఆపరేషన్లకు ఎంపిక చేశారు. సీఎస్ఆర్ మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు.

వితరణ



వసతి గృహాధికారికి గ్రైండర్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

సారవకోట: మండల కేంద్రంలోని సమీకృత వసతిగృహ అధికారి మోహన్‌రావుకు నరసన్నపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రైండర్‌తో పాటు విద్యార్థులకు రివిజన్ బుక్స్‌ను ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రమణ సాహు, కార్యదర్శి సాయిరాం, రీజనల్ చైర్మన్ వి.వి.రంగనాథ్, జిల్లా చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం గొప్పది



ప్రసంగిస్తున్న నిత్యానంద స్వామి

సారవకోట: సనాతన ధర్మం ఎంతో గొప్పదని నర్సిపురంలోని ఓమనాశ్రమం పీఠాధిపతి నిత్యానంద స్వామి అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలోని పీఏసీఎస్ ఆవరణలో ఆధ్యాత్మిక విజ్ఞాన పీఠం, దివ్యజీవన సమాజం ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ఆచార, సంప్రదాయాలు విజ్ఞాన శాస్త్రంతో ముడిపడి ఉన్నాయన్నారు. యువత ఆధ్యాత్మికత పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్.కరుణాకర్, అల్లు రామయ్య, జి.మోహన్‌రావు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు.

దుకాణాల తనిఖీ



జాగిలంతో తనిఖీ చేస్తున్న పోలీసులు

బూర్జ: మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో పోలీసులు ఆదివారం జాగిలంతో తనిఖీ చేశారు. గంజాయి, తదితర మత్తు పదార్థాలు విక్రయాలను అరికట్టేందుకే తనిఖీ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసలు



అల్లు తిరుపతిరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న తహసీల్దార్ రవిచంద్ర

కొత్తూరు: రెవెన్యూ శాఖ పరిధిలో ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉద్యోగులకు గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని తహసీల్దార్ రవిచంద్ర ఆదివారం ప్రశంసాపత్రాలను అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ముగడ మహేంద్ర, పారాపురం గ్రామ సచివాలయ సర్వేయర్ అల్లు తిరుపతిరావు, వసప సచివాలయ వీఆర్వో గిరిష్ కుమార్ పట్నాయక్, గూనభద్ర వీఆర్వో డి.వెంకటరావు ఉన్నారు. డీటీ భీమారావు, మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, ఆర్ఐ లక్షణరావు పాల్గొన్నారు.

కొత్తూరు: 150 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న భారతి ఇంటర్ నేషనల్ స్కూల్ విద్యార్థులు



ఘనంగా గణతంత్ర దినోత్సవం

గణతంత్ర వేడుకలు ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల ఆవరణలో జాతీయ జెండాను అధికారులు, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: మారుతీనగర్‌లో 500 మీటర్ల జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ చేస్తున్న శ్రీజ్ఞానజ్యోతీ స్కూల్ విద్యార్థులు



నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



బూర్జ: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పోలాకి: పోలీస్ స్టేషన్ వద్ద విన్యాసాలు చేస్తున్న విశ్వశాంతి విద్యార్థులు



మెళియాపుట్టి: చాపర సచివాలయంలో గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు



ఆమదాలవలస: మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీప్రసాద్



ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద రిపబ్లిక్ డే వేడుకలు



ఆమదాలవలస: తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రాంబాబు



కొత్తూరు: తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రవిచంద్ర



పొందూరు: జెండాను ఆవిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న



సారవకోట: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



సరుబుజ్జిలి: పురుషోత్తపురం సచివాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు



పాతపట్నం: పాతపట్నం కోర్టు ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రోషిణి



జలుమూరు: మండల పరిషత్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ అప్పలనాయుడు, ఎంపీపీ గోపి



నరసన్నపేట: తహసీల్దార్ కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



హిరమండలం: మండల పరిషత్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు



పాతపట్నం: విక్టరీ పాఠశాలలో దేశ నాయకుల వేషధారణలో చిన్నారులు



పాతపట్నం: ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పరామర్శ..



జాయి శ్రీకాంత్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్, నాయకులు

నరసన్నపేట: మండలంలోని పలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలను పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ ఆదివారం పరామర్శించారు. బుచ్చిపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జాయి శ్రీకాంత్ కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీకాంత్ భార్య, కుమారులు, కుమార్తెకు ధైర్యం చెప్పారు. పాలకొండపేటలో పాలకొండ మల్లేష్ అనారోగ్యంతో మృతి చెందారు. మల్లేష్ కుటుంబ సభ్యులను కృష్ణదాస్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ అరంగి మురళి, పార్టీ నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, రాజాపు అప్పన్న, కనపల శేఖరరావు, సురంగి నర్సింగరావు, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

చంద్రయ్య హత్య దారుణం

ఆమదాలవలస: మండలంలోని బొబ్బిలిపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గురుగుబెల్లి చంద్రయ్య హత్య దారుణమని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోట గోవిందరావు ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. హత్యకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. దోషులు ఎంతటివారైనా పట్టుకుని శిక్షించాలని డిమాండ్ చేశారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

సారవకోట: మండలంలోని బుడితి గ్రామానికి చెందిన డాక్టర్ నిక్కు అప్పన్న రాసిన 'నేను నా జన్మభూమి బుడితి' పుస్తకావిష్కరణ కార్యక్రమం నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. బుడితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో బుడితిలో ఉన్న ప్రత్యేకతలు, చుట్టు పక్కల ఉన్న గ్రామాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేకతలు, ఇక్కడ చదువుకున్న వాళ్లు ప్రస్తుతం ఏయే స్థానాల్లో ఉన్నారు, ఆలయాల విశిష్టత, పంటలు, కులాలను ప్రస్తావిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, ధర్మాన తేజ్ కుమార్, సర్పంచ్ పొన్నాన శంకరరావు, ఎంపీటీసీ మురళి, చిన్నపిల్లల వైద్యులు ధర్మాన లక్ష్మీనారాయణ, విశ్రాంతి ప్రిన్సిపాల్ గాలి మోహన్‌రావు, విశ్రాంత వైద్యుడు మెండ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వ్ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీలో గల రిజర్వ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రవిచంద్ర ఆదివారం హెచ్చరించారు. ఇప్పటికే కాలనీలో వీఆర్ఏతో దండోరా వేయించామన్నారు. కాలనీలోని రిజర్వ్ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఇప్పటికే పలువురు ఫిర్యాదు చేశారన్నారు. రిజర్వ్ స్థలాలను సర్వే చేస్తామన్నారు.

మోక్షమెప్పుడో?

- పాలకుల ప్రచార అస్త్రంగా కడపలవాని గెడ్డ
- రైతులకు ఊరిస్తున్న బ్రిడ్జి నిర్మాణం
- 25 ఏళ్లకు పైగా హామీలతోనే సరి..
- 3 వేల ఎకరాలకు తప్పని వరద ముంపు



కడపలవానిగెడ్డపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

ఎల్.ఎన్.పేట: మండలంలోని తురకపేట–దబ్బపాడు గ్రామాల మధ్య కడపలవానిగెడ్డ ఉంది. ప్రతీ ఏడాది వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు పంట పొలాల్లో నుంచి ప్రవహిస్తూ వచ్చి ఈ గెడ్డ ద్వారా వంశధార నదిలోకి వెళ్తుంది. కొద్దిపాటి వర్షం కురిసినా కడపలవానిగెడ్డకు వరద నీరు పోటెత్తుతుంది. వరదనీరు కారణంగా సుమారు 3 వేల ఎకరాల పంట భూములు నీట మునిగిపోతాయి. వంశధార నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉంటే వరదనీరు రెండు, మూడు రోజుల్లోనే తగ్గిపోతుంది. నదిలో వరద ఎక్కువగా ఉంటే పది, పదిహేను రోజులు పొలాల్లోనే ఉంటుంది. గెడ్డపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉంటే రాకపోకలు నిలిచిపోతాయి. గెడ్డకు ఆవల ఉన్న వాడవలస, దబ్బపాడు గ్రామాలకు చెందిన ప్రజలు తురకపేట సెంటర్‌కు వచ్చేందుకు ఇబ్బంది పడాల్సి ఉంటుంది.

1999 నుంచి హామీలతోనే సరి..

కడపలవానిగెడ్డ సమస్యకు మోక్షం కలిగిస్తామని ప్రజాప్రతినిధులు ఇస్తున్న హామీలు 1999 నుంచి గెడ్డకు వచ్చిన వరదల్లోనే కొట్టుకుపోతున్నాయి. రోడ్డుపై వంతెన నిర్మిస్తామని ఎన్నికల ప్రచారంలో నేతలు ఇచ్చిన హామీలు రైతులతోపాటు ఈ ప్రాంత ప్రజలకు ఊరిస్తూనే ఉన్నాయి. 1999లో చంద్రబాబు పాలనలో ఉన్న మంత్రులు, ఈ తరువాత గెలిచిన ఎమ్మెల్యేలు, 2009 ఎన్నికల్లో గెలిచి ఐదేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన శత్రుచర్ల విజయరామరాజు, 2014లో గెలిచిన ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, అప్పటి ఇరిగేషన్ మంత్రి దేవినేని ఉమ, అప్పటి ఉప ముఖ్యమంత్రి చిన్నరాజప్ప ఇలా ఎంతో మంది కడపలవానిగెడ్డకు మోక్షం కలిగిస్తామని, ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరలేదు.



వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

ఏం చేయాలంటే..

కడపలవానిగెడ్డ మూడు కిలో మీటర్ల మేర ఉంది. సుమారు 15 నుంచి 20 మీటర్ల వెడల్పుతో ఉన్న గెడ్డలో ఆక్రమణలు పెరిగిపోవడం వలన వరద నీరు పంట పొలాలను ముంచెత్తుతుంది. గెడ్డ నుంచి వెళ్లే వరద నీరు వంశధార నదిలో కలిసే ప్రాంతంలో ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. గెడ్డలో పూడికలతోపాటు ఆక్రమణలు తొలగించాలి. తురకపేట వద్ద గెడ్డపై వంతెన నిర్మాణం పనులు చేపట్టి ఎత్తు పెంచాలి. ఇలా చేయడం వల్ల రైతులకు మేలు జరుగుతుంది.

నష్టపోయే గ్రామాలివే..

కడపలవానిగెడ్డకు వరదనీరు పోటెత్తినప్పుడు తురకపేట, దబ్బపాడు, కృష్ణాపురం, సుమంతాపురం, వాడవలస, మిరియాపల్లి, సీతారాంపురం, చిట్టిమండలం, ధనుకువాడ, నరేంద్రపురం, సోమనాథపురం, కోవిలాం, రావిచెంద్రి, చింతలబడవంజ, సిద్ధాంతం, బరటాం తదితర రెవెన్యూ గ్రామాలకు చెందిన సుమారు 3 వేల ఎకరాల పంట భూములు నీట మునిగిపోతున్నాయి.

ప్రతీ ఏడాది నష్టమే



చిన్న వర్షం పడితే కడపలవానిగెడ్డ వద్ద వరద నీరు పెరిగిపోతుంది. పంట పొలాలు పూర్తిగా మునిగిపోతున్నాయి. ఒక్కోసారి పది, పదిహేను రోజలపాటు పంటలు నీటిలో ఉండిపోతాయి. పంటలు కుళ్లిపోయి పనికి రాకుండా పోతున్నాయి. ప్రతీ ఏడాది నష్టమే జరుగుతుంది. ఎంతో మంది నాయకులు, మంత్రులు వచ్చి హామీలు ఇచ్చి వెళ్లిపోయారే తప్ప పరిష్కరించలేదు.

– పి.అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట